# అమ్మ

అద్దేపల్లి సుభద్ర




ఆవూరికి మేము ట్రాన్స్‌ఫర్ మీద వచ్చాం. కృష్ణా జిల్లాలో ఒక చిన్నపల్లెటూరు అది.

మరీ పల్లెటూరుగాదు. ఆ ఊరు నాకు క్రొత్త కాదు. నా చిన్నపుడు నేను ఇక్కడే చదువుకున్నాను. నా భార్యకి మాత్రం కొత్త. లక్ష్మి అంటే నా భార్య ఇంటికి రాగానే విశేషాలు చెప్తుంటే వినేవాడిని. మా అబ్బాయి దీపుకి అప్పుడు మూడో సంవత్సరం. నేను రోజూ బ్యాంకుకి వెళుతున్నపుడు నాకు చిన్నతనం నుంచి ఉన్న అలవాటుని మాత్రం మానుకోలేక పోతున్నాను. అదేమిటంటే మెయిన్ రోడ్డుపై ఒక ఫోటో స్టూడియో వుంది. స్టూడియో గోడ మీద ఎదురుగా వీధిలోకి కనబడేట్లు ఒక అందమైన స్త్రీఫోటో వుంది. నేను నా చిన్న తనం నుంచి దానిని చూస్తూ వుండేవాడిని. ఆ స్త్రీ మూర్తిలో నాకు నా తల్లి కనబడేది. చిన్నతనంలో తల్లిని కోల్పోయిన నేను స్కూలుకి వెళుతున్నప్పుడు ఆ ఫోటోని చూస్తూ వుండిపోయి స్కూలు మానేసిన సంఘటనలు ఎన్నో. ఆ ఫోటోను చూస్తూంటే నాకు ఇప్పుడు అనిపిస్తూంటూంది. అసలు ఆ ఫోటోలో ఆమెను నేను చూడగలనా? ఇప్పుడు ఆమె ఎలా వుంటుంది. నా మనోఫలకంపై ఆ స్త్రీ పెద్ద ముత్తయిదువలా సాక్షాత్కరిస్తూంటుంది. అలా ఆమెలో నా తల్లిని చూసుకుంటూ ఉంటున్నాను. కాని, ఆమెను నేను నిజంగా చూడగలనని అనుకోలేదు. కాని నా కోరిక అనుకోకుండా మా లక్ష్మి వలననే తీరింది.

ఆ రోజు నేను ఇంటికి రాగానే లక్ష్మి, కంగారుపడుతూ చెప్పిన సంగతి ఏమిటంటే బాబు పడుకొన్నాడని లక్ష్మి దొడ్లో పనులు చేసుకుంటోందిట. ఎప్పుడు లేచాడో బాబు బయట ట్రాక్టరు చప్పుడువిని నవ్వుతూ దానికి ఎదురు వెళ్ళాడంటే. ఇది ప్రక్కనే ఉన్న పిన్నిగారు ( మా ఆవిడ చెప్పిందం డోయ్) చూసి గబుక్కున ఎదురెళ్ళి బాబుని తీసుకొని ఇంటిలోకి వచ్చి లక్ష్మిని మెత్తగా మందలించిందిట. నాలాగే మా లక్ష్మి గూడా తల్లిలేనిపిల్ల గావడం వల్ల ఆ పిన్నిగారిని చూసి చాలా ఆనందపడి పిన్నిగారూ అని వరస కలిపిందట. ఇంకా ఆనాటి నుంచి లక్ష్మి మాటలలో బాబిగాడితో పిన్నిగారి కబుర్లు దొర్లసాగాయి. లక్ష్మి మాటలలోని ఆ పిన్నిగారు నాకు బాగా తెలిసినట్లే అనిపించసాగింది. ఒకసారి లక్ష్మి ఆమె కథ చెప్పి బాధపడింది.

పాపం పిన్నిగారికి ఇద్దరు కొడుకులటండీ. పెద్ద వాడు 12 సంవత్సరాలకే లారీ ప్రమాదంలో మరణించాడట. పల్లెటూరు గావడం వల్ల డాక్టరు సహాయంలేక మరణించాడట. అందుకే పట్టుదలగా రెండోవాడిని డాక్టరు చదివించారట. కోడలు కూడా డాక్టరే. మనమలని చూసుకుంటూ పిన్ని గారు, బాబాయిగారు వుంటున్నారు. ఎవరయినా పిల్లలు రోడ్డు దాటుతుంటే వాళ్ళ పెద్దబాబు 'మధు' గుర్తుకు వస్తాడట. లక్ష్మి చెబుతూనే వుంది. నా మనస్సు ఆ సంఘటన ఎప్పుడో

Heros' BS-27 TEL



చూసినట్లే వుంది. నాకు ఎలాగ యినా పిన్నిగారిని చూడాలని అనిపించింది. కాని, ఆమె ఎప్పుడు బయట కనిపించలేదు. అనుకోకుండా నా కోరిక ఒక రోజు తీరింది.

ఇంటికి వచ్చాక బాబుతో ఆడుకుందామని చూస్తే ఒళ్ళు కొంచెం వేడి అనిపించింది. లక్ష్మిని అడిగితే మందు వేశానని చెప్పింది. కాని, సాయంత్రానికి బాగా పెరిగిపోయింది. రాత్రి బాబుని చూస్తే నాకే భయం వేసింది. లక్ష్మిసరే. ఏడవడం మొదలెట్టింది. ఈ సమయంలో ఏం చేయడం? డాక్టర్లు ఎవరున్నారు? అనుకుంటుంటే లక్ష్మి పిన్నిగారి కొడుకు, కోడలు డాక్టర్లని, వాళ్ళకి చెప్పమని గుర్తు చేసింది. నిజమే అనుకుంటూ నేను గబగబా ఎదురింటికి వెళ్ళాను. వచ్చి ఆరు నెలలయినా నేను ఎవరింటికి వెళ్ళనేలేదు. కాలింగ్ బెల్ నొక్కగానే వచ్చి ఆమె తలుపు తీసింది.

పిన్నిగారు! మా దీపుకి బాగాలేదండీ. నేను ఎదురింట్లో వుంటున్నాను. కంగారులో ఏదో చెప్తున్న నన్ను చూసి లైటువేసి అడిగారు ఆమె. లక్ష్మి భర్తవా బాబు? కంగారుపడకు. మా అబ్బాయి, కోడలు చూసుకుంటారులే?. అంటూ నావైపు తిరిగిన ఆమెనుచూసి నేను, నన్ను చూసి ఆమె అవాక్కయిపోయాము.

ఆమె, ఆ ఎదురింటి పిన్నగారు ఎవరో కాదు. నేను రోజూ ఎవరి ఫోటో చూసి ఆమెను సజీవంగా చూస్తే బాగుంటుందని అనుకుంటున్నానో ఆమె. నా ఊహలలో వున్నట్లే పెద్ద బొట్టుతో వయస్సు తెచ్చిన పెద్దరికంతో అచ్చం మా అమ్మలాగ వున్నారు. ఆమె కొడుకు కోడలు మా దీపుకి వైద్యం చేయించడం గాని, బాబు తేరుకోవడంగాని ఇప్పుడు నా దృష్టిలో లేదు. నా మనస్సంతా అమ్మపైనే ఉంది.

ఆమెగూడా నన్ను ఆశ్చర్యంగా చూడసాగారు. మేమిద్దరం ఇది వరకటి నుంచి తెలిసినట్లే మాట్లాడుకోసాగాం. లక్ష్మి గూడా చాలా సంతోషించింది. ఒకనాడు లక్ష్మి అందినాతో, వాళ్ళ పెద్దబ్బాయి మధు వుంటే అచ్చం నాలాగే వుండేవాడని. అందుకే నన్ను చూడగానే ఆమె తెల్లబోయిందని. అప్పుడు నాకు అనిపించింది. అవును నిజమే, మా యిద్దరిది గత జన్మలో బంధం. నిజంగానే నేను ఆమె పెద్ద కుమారుడిని అయి వుంటాను. అందుకే నాకు ఆమె నా స్వంత తల్లి అనిపిస్తోంది. అవును ఆమె మా అమ్మ. ఈ జన్మకి, క్రిందటి జన్మకి, ఏ జన్మకీ ఆమె నా తల్లి. నామనస్సు అమ్మయందు భక్తితో, ప్రేమతో పొంగి పోతూంది. ఇప్పుడు నేను ఆ ఇంటి పెద్దకొడుకుని. అమ్మ మా యిద్దరికీ అమ్మే. మాకు ఆ ఊరి నుంచి ఇంకో ఊరు వేసేసినా, నేను వారానికి ఒక్కసారయినా లక్ష్మిని, బాబుని తీసుకొని అమ్మ దగ్గరకు వెళ్తాను. అమ్మ మా ఇంటికి వస్తూంటూంది. బాబు తర్వాత పాప పుడితే అమ్మ పేరే పెట్టుకున్నాను 'సునంద' అని అమ్మ ఆనందానికి హద్దులే లేవు.

మాతృభావన మధురమైన భావన.


## చీరెల మోజు!




సైరాభాను తల్లి నశీమ్ అందాల రాణి అనే విషయం అందరికీ తెలిసిందే. ఆ రోజుల్లో ఆమె అందాన్ని గురించి సౌందర్యాధకులంతా ఉవ్విళ్ళూరుతూ చెప్పకునేవారు. అప్పటి యువతరానికి నశీమ్ ''కలల రాణి''! ఒక్కొక్కళ్ళకు ఒక్కొక్క వస్తువుపై ఎలా మోజు వుంటుందో, నశీమ్‌కు కూడా అలాగే చీరెల మీద అంతులేనంత మోజు వుంది. అందమైన, ఖరీదైన చీరెలంటే ఆమెగారికి వీరావేశం వచ్చేస్తుంది. చీరెల సేకరణ నశీమ్ హాబీ! ఆమె అందానికి తోడు హుందాతనాన్ని ప్రదర్శించేది. ఒక మహా రాణిలా గంభీరంగా వుండేది. విలాసవంతమైన జీవితం నశీమ్‌ది. ఆమె గుర్రపు స్వారీ చేసేది. గుర్రపు పందాలకు వెళ్ళేది. బట్టల దుకాణానికి వెళ్ళి బట్టలు కొనడం అంటే ఆమెకు పరమానందం. వెయ్యి చీరెలు బీరువాలో మూలుగుతున్నా పదే పదే ఆమెగారు చీరెలు కొంటూనే వుండేది!

నశీమ్ చీరెల పిచ్చి, ఆమె కుమార్తె-సౌందర్య రాశి అయిన సైరా భానుకు కూడా పట్టింది! ఆవిడగారి గదినిండా గుట్టలు గుట్టలుగా చీరెలు పడి వుంటాయి. అదొక రంగుల ప్రపంచం! సైరా ఎన్నడూ ఒక చీరెను రెండు సార్లకు మించి కట్టదు! అది ఆమెగారి వ్రతం! — కొడిమెల

## పురావస్తు పేకలు




పేకాట అంటే సామాన్యంగా ఇష్టపడనివారు-సరదాగా ఆడని ఆడవారు - మగవారు మనలో చాలా అరుదు. పురావస్తు శాఖవారికి మనదేశంలోని ప్రాచీన కాలపు పేకలు ఎన్నో దొరికాయి. పేకని గుండ్రని ఆకారంలో ఏనుగుదంతాలతో నిర్మించేవారట. దానిపైన గుక్కా పాలిష్ చేసి దాన్ని కూడా కళాఖండాలుగా రూపొందించుకున్నారు. పదిముక్కల్లో దశావతారాలబొమ్మలుండేవి. మరొక రకం సెట్టు శివుడు-అర్ధనారీశ్వర రూపంతో తయారుచేశారు. ఒక పురుషుని చేతిలో చిన్న గిన్నె-స్త్రీ చేతిలో కత్తి, వుంగరంగా చిత్రించారు- అవి మనం రాజు-రాణి అని పిలిచేవి కావచ్చు. ఇవే చిహ్నాలు ప్రాచీన ఇటలీ పేకలో కూడా ప్రత్యక్షం అయ్యాయి. అంటే మన పూర్వీకులు ఆటలు పాటలు మార్పులతో మనం అనుసరిస్తూనే వున్నాం ఇప్పుడు.

— జె. లలితాదేవి


కోరమాండల్ సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్